క్లుప్తంగా

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. శుక్రవారం కల్వటాల సమీపంలోని రామ్‌కో మాతృవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి (ఏక్ పేడ్ మాకే నామ్) అని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 500 మంది ఉద్యోగులు మొక్కలను నాటారు. పరిశ్రమలో పనిచేసే ప్రతి ఒక్కరికీ మొక్కల బాధ్యత అప్పగించామని తెలిపారు. ఎవరు నాటిన మొక్కకు వారి అమ్మ పేరు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ రవికుమార్, హార్టికల్చర్ జీఎం ఈశ్వరన్ పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత



ప్యాపిలి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను శుక్రవారం శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. ఆషాడమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరం


ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పర్యవేక్షణ చేస్తున్న ఎస్‌ఐ వరప్రసాద్

కోవెలకుంట్ల: విద్యార్థినులు, యువతులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, ఈవ్‌టీజింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ వరప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి ఇంటికి వెళ్లే విద్యార్థినులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల వద్ద పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఈవ్‌టీజింగ్ జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువకులకు సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పేర్కొన్నారు.

అమర జవానుల త్యాగాలు మరువలేనివి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన వీర జవానుల త్యాగాలు మరువలేనివని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 25వ కార్గిల్ విజయ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కుటుంబాలకు దూరంగా దేశం కోసం జవానులు భారతదేశ సరిహద్దులను రక్షిస్తున్నారని తెలిపారు. 1961లో ఆపరేషన్ విజయ్‌తో గోవా విముక్తి, 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావం, 1999లో కార్గిల్ విజయం వంటి అంశాలను విద్యార్థులు గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణదాసు, లక్ష్మీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలి


దక్షిణ మధ్య రైల్వే జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్: కరోనా సమయంలో నిలిపివేసిన రైళ్లను యథావిధిగా కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడులు డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్ రైల్వే స్టేషన్‌ను పరిశీలించేందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని, నంద్యాల నుంచి అనంతపురం వరకు డెమో రైలును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. డోన్ స్టేషన్‌లో లిఫ్ట్, ఎస్కలేటర్, అదనపు బుకింగ్, రిజర్వేషన్ కౌంటర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నాయకులు రాధాకృష్ణ, మోటారాముడు, నారాయణ, వరదరాజులు ఉన్నారు.

ఆటలకు సెలవు!

క్రీడల్లో రాణించాలనే తపన ఉన్నా మార్గదర్శకం చేసే గురువు లేకపోతే వెనుకబడినట్లే. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో శిక్షణ ఇస్తేనే జిల్లా, రాష్ట్ర ఆపై స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ పాఠశాలల విద్యార్థులకు శిక్షణలో పీఈటీలే కీలకంగా వ్యవహరిస్తుంటారు. అయితే కొలిమిగుండ్ల మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరంఅవుతున్నారు. మొత్తం 12 పాఠశాలల్లో తొమ్మిది పీఈటీ పోస్టులు ఖాళీగా ఉండడమే ఇందుకు నిదర్శనం. పీఈటీలు లేకపోవడంతో ప్రార్థనా సమయాలు, ఖాళీ సమయాల్లో విద్యార్థులను కట్టడి చేయాల్సిన బాధ్యత కూడా సబ్జెక్టుల ఉపాధ్యాయులపైనే పడుతోంది.

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టుల ఖాళీ
- కొలిమిగుండ్ల మండలంలో 12 పాఠశాలలు
- తొమ్మిది పీఈటీ పోస్టులు ఖాళీ
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు


కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: చదువులో పుస్తకాలతో కుస్తీ పడుతూనే.. క్రీడల్లో తలపడుతుంటే చూడముచ్చటగా ఉంటుంది. మైదానాల్లో ఒకరితో ఒకరు తలపడుతూ గంతులేస్తు కేరింతలు కొట్టడం ఎంతో గానో ఆకట్టుకుంటుంది. విద్యార్థులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి. అయితే ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీ ఏర్పడటంతో విద్యార్థులకు ఆట పాటలు లేకండా పోయాయి. కొలిమిగుండ్ల మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2973 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్‌కు మాత్రమే పీఈటీలు ఉన్నారు. మిగిలిన తొమ్మిది పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడాది క్రితం బదిలీలు, పదోన్నతులు జరగడంతో ఇక్కడి నుంచి పీఈటీలు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. పీఈటీలు లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాఠశాల ప్రారంభ సమయంలోనే పీఈటీల ఆధ్వర్యంలో ప్రార్థన జరుగుతుంది. బెల్ కొట్టించేందుకు ఉన్న ఉపాధ్యాయులే బాధ్యతలు చూడాల్సి వస్తుంది. పీఈటీలు ఉన్న సమయంలో విజిల్ వేస్తే విద్యార్థులు ఎక్కడున్నా పరుగెత్తుకొని తరగతి గదులకు చేరుకునేవారు. ప్రతి రోజు విద్యార్థులతో వివిధ రకాల క్రీడలు ఆడించేవాళ్లు. గతంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో రాణించారు. జోనల్, జిల్లా స్థాయి పోటీలతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించారు.

మండలంలో పాఠశాలల వివరాలు	
ఉన్నత పాఠశాలలు	10
మోడల్ స్కూల్	01
కస్తూర్బా పాఠశాల	01
విద్యార్థులు	2973
పీఈటీ పోస్టుల ఖాళీలు	09

ఏడాది వరకు పోస్టుల భర్తీ లేనట్టే..!

ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీఈటీల పోస్టులు భర్తీ చేయాలంటే వచ్చే విద్యా సంవత్సరం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పతోంది. ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణ పూర్తి చేసి పోస్టులు పూర్తి చేసేందుకు ఏడాది పట్టనుంది. అప్పటి వరకు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆట పాటలు సెలవు ప్రకటించినట్లే. ఇతర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి. బదిలీలు, పదోన్నతులు కల్పించిన సమయంలో కొలిమిగుండ్ల మండలానికి ఎవరూ రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు క్రీడా విద్య అందని ద్రాక్షలా మారింది. శారీరక, మానసిక ఉల్లాసానికి అవకాశం లేకుండా పోతోంది. కేవలం సబ్జెక్టులపైనే దృష్టి పెట్టాల్సి వస్తుంది.

నేడు రక్తదాన శిబిరం

డోన్ టౌన్: స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో డోన్ కొత్త బస్టాండ్ వద్దనున్న ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి ప్రారంభం అవుతుందని.. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7989474725 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బోధనలో మెలకువలు అవసరం

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలు పెంపొందించడానికే శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎస్‌సీఈఆర్‌టీ అబ్జర్వర్ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా అలెస్కో కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, కోర్సు డైరెక్టర్, ఎంఈఓ సోమశేఖర్ ఉన్నారు.

చీటింగ్ కేసు నమోదు

బేతంచెర్ల: దక్షిణాఫ్రికాలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని బేతంచెర్లకు చెందిన సయ్యద్ సలీమ్ మహ్మద్ రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశారని ప్రొద్దుటూరుకు చెందిన షేక్ బాబర్ హుసేన్, అతని కుమార్తె ముస్కాన్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం వలి తెలిపారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తతే రక్ష


అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని మురుగు కాల్వలో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

కోవెలకుంట్ల: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణం అవుతాయని.. అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సర్పంచ్ మెట్ల సరళ, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రత్యేక శానిటేషన్ సందర్భంగా వర్షపు నీరు నిల్వ ఉన్న పలు ప్రాంతాల్లో దోమ లార్వాను చంపేందుకు ఆయిల్ బాల్స్ వేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ గోపినాథ్ అధ్యక్షతన వార్డు మెంబర్లు, గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులతో తాగునీరు, పారిశుద్ధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం లోపించడం వల్లే దోమలు వృద్ధి చెంది డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

డోన్ రైల్వే స్టేషన్‌లో బైక్ చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద తరచూ బైక్‌లు చోరీకి గురవుతున్నాయి. మూడు రోజుల క్రితం పట్టణంలోని కొత్తపేటకు చెందిన శాంతప్ప బైక్ చోరీకి గురైన సంఘటన మరువక ముందే మరో బైక్‌ను దుండగులు అపహరించారు. కృష్ణగిరి మండలం కర్లకుంట గ్రామానికి చెందిన ఉప్పరి శేఖర్ శుక్రవారం ఉదయం తన హీరో స్పెండర్ ప్రో బైక్‌ను రైల్వేస్టేషన్ వద్ద ఉంచి వ్యక్తిగత పనుల నిమిత్తం రైలులో మద్దికెరకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దక్షిణ మధ్య రైల్వే జీఎం స్టేషన్‌ను తనిఖీ చేసిన రోజే బైక్ చోరీ జరగడం గమనార్హం.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గమ్మ గుడి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న దుర్గాపేట కాలనీకి చెందిన బుడ్డగాళ్ల శివను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య శుక్రవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అన్న దాడి చేశాడని చెల్లెలు ఫిర్యాదు

బనగానపల్లె రూరల్: అన్న దాడి చేశాడని చెల్లెలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ తిరుపాల్ వివరాల మేరకు.. మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన చాకలి బాలసుబ్బయ్య తన తల్లి మద్దమ్మను సక్రమంగా చూసుకోకపోవడంతో ఆమె కూతురు వెంకట లచ్చమ్మ తన ఇంటికి తీసుకెళ్లి బాగోగులు చూసుకుంటోంది. ఇది సహించలేని బాలసుబ్బయ్య చెల్లెలితో వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ ఆఫీసర్

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు తెలిపారు. శుక్రవారం బనగానపల్లె ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఎక్కువగా దగ్గు, జ్వరం, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తప్పనిసరిగా దోమ తెరలను వినియోగించాలని తెలిపారు. హాస్టల్ పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, వార్డన్ శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌తో నైపుణ్యాల వెలికితీత


చార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ్‌తో విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసే అవకాశం ఉంటుందని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 5వ రోజు శుక్రవారం విద్యార్థులతో పలు రకాల వస్తువులు చేయించారు. అనంతరం నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదించినప్పుడే జీవితంలో రాణించగలుగుతారన్నారు. పేపరుతో పడవలు, రంగు పేపర్లతో డిజైన్లు, బొమ్మలు తయారీ, బుట్టలు, సంచులు, అల్లికలు, డ్రాయింగ్ తదితర వాటిని విద్యార్థులతో చేయించారు. ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శ్రీనివాసులు, అల్లీపీరా, రఘునాథ్, మధుసూదనరెడ్డి, లీలావతమ్మ, హుస్సేన్‌భాను, మునిరాజు రాధ, దేవేంద్రప్ప, సురేష్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, రవిశేఖర్ పాల్గొన్నారు.

సేవతోనే ఆత్మసంతృప్తి


సీహెచ్‌సీలో అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


బేతంచెర్ల: సేవతోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని, ఇతరులకు సేవ చేయడం మన ధర్మమని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు ఆల చంద్రమోహన్, మహేంద్రబాబు సహకారంతో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. క్లబ్ సభ్యులు శేఖర్, సాంబ శివారెడ్డి, మనోహర్‌రెడ్డి, నాయుడు, రాజు పాల్గొన్నారు.

బైక్‌లో ఉంచిన రూ.4లక్షలు చోరీ

- స్వీట్ స్టాల్‌కు వెళ్లగా అపహరించిన దొంగలు

బేతంచెర్ల: ఊరిలో పొలం అమ్మగా తన వాటాగా వచ్చిన రూ.4 లక్షలను బైక్ ముందు భాగంలోని బ్యాగులో ఉంచుకుని ఇంటికి బయలుదేరాడు.. తన సంతోషాన్ని కుటుంబంతో పంచుకోవాలని భావించాడు. స్వీట్లు తీసుకోవడానికి బైక్‌ను స్వీట్ స్టాల్ ముందు పార్కు చేసి లోనికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి నగదు కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన బేతంచెర్ల పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. బేతంచెర్ల డ్రైవర్స్ కాలనీకి చెందిన కె.నాగేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సొంతూరు వెల్దుర్తి మండలం పులగుమ్మిలో అన్నదమ్ములకు చెందిన పొలాన్ని విక్రయించారు. కర్నూలులో రిజిస్ట్రేషన్ అనంతరం తన వాటాగా వచ్చిన రూ.4 లక్షలను తీసుకుని బైక్ ముందు భాగంగా ఉన్న బ్యాగులో ఉంచుకుని ఇంటికి బయలుదేరాడు. బేతంచెర్ల పాతబస్టాండ్ వద్దకు రాగానే స్వీట్లు తీసుకెళదామని రంగయ్య స్వీట్ సోటల్ వద్ద బైక్‌ను ఆపి లోనికి వెళ్లాడు. అతన్ని అనుసరిస్తూ వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌లో ఉన్న రూ.4 లక్షలతో అపహరించారు. వచ్చి చూడగా నగదు కనిపించకపోవడంతో నాగేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హాస్టల్స్‌లో సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

బేతంచెర్ల: ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమాను కొండలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యా రంగం సమస్యలపై వినతి

డోన్ టౌన్: విద్యారంగ సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయిపోతున్నాయని.. ప్రభుత్వం చక్కదిద్దాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవై సుబ్బరాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్‌కు వినతి పత్రం అందజేశారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని, ప్రీప్రైమరీతో పాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాల నడపాలని, ఉన్నత పాఠశాలల్ల రెండు మధ్యమాలను సమాంతరంగా నడపాలని విజ్ఞప్తి చేశారు.

పవర్ టిల్లర్ యూనిట్‌లపై అవగాహన

ప్యాపిలి: పవర్ టిల్లర్ యూనిట్‌లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు. శుక్రవారం అలేబాదు తండాలో పవర్ టిల్లర్ యూనిట్‌ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ యూనిట్ మంజూరైన లబ్ధిదారులు గొర్రెలు, మేకల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న వాల్మీకులు

బేతంచెర్ల: పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఘటన జరిగి నెల కావస్తున్నా ఆచూకీ గుర్తించలేకపోవడం ప్రభుత్వ చేతకాని తనమని విమర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

జోరందుకున్న మిర్చి సాగు

సంజామల: మండలంలో మిర్చి సాగు జోరందుకుంది. బోరుబావుల కింద మిర్చి నారు మడులు సిద్ధం చేశారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాలు పదులు అయ్యాయి. అంతేకాకుండా శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద నీరు పోటెత్తడంతో ఈసారి ఎస్సార్‌బీసీ కాల్వలకు నీరు వస్తాయని రైతులు నమ్మకంతో ఉన్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కేవలం 5,400 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎస్సార్‌బీసీ కాల్వలకు నీరు వదిలితే మిర్చి సాగు పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.


ఆకుమల్లలో ట్రాక్టర్ సహాయంతో మిరప విత్తనం వేస్తున్న రైతన్న

పండ్ల తోటల సాగుతో ఆర్థికాభివృద్ధి


బలపాలపల్లెలో ఉపాధి హామీ పథకం కింద మామిడి మొక్క నాటుతున్న కలెక్టర్

- ఉపాధి హామీ పథకంలో అవకాశం
- చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల: చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈ పథకం కింద శుక్రవారం మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో రైతు మునిస్వామి పొలంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా చీని, నిమ్మ, మామిడి, సపోట, జామ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, నేరేడు, సీతాఫలం, మునగ, మల్లె, గులాబీ సాగు చేసుకోవచ్చని తెలిపారు. పండ్ల తోటల సాగుకు వంద శాతం రాయితీ ఉంటుందన్నారు. మూడేళ్ల నిర్వాహణ ఖర్చులు అందజేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో డ్రిప్ కింద సాగవుతున్న మామిడి తోటను పరిశీలించారు. ఆ తర్వాత తవిసికొండ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న కందకాలను తనిఖీ చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామని చెప్పారు. అనంతరం కొలుములపల్లె గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు వెంకటరెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. కలెక్టర్ వెంట పీడీ రామచంద్రారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ, ఏపీడీ బాలాజీ నాయక్, ఎంపీడీఓ రవి ప్రసాద్, సర్పంచ్‌లు చిన్న మద్దమ్మ, లక్ష్మీదేవమ్మ, ఏపీఓ శేషన్న తదితరులు ఉన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకుంటే చర్యలు

- కమిషనర్ జయరామ్


చెత్త సేకరణపై ఆరా తీస్తున్న కమిషనర్ జయరామ్

డోన్: ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించకుంటే యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జయరామ్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. వార్డులో ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించారు. వీటి కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. శుభ్రం చేసుకోవాలని యజమానులకు సూచించారు. అలాగా శిథిలావస్థలో ఉన్న గృహాలను తొలగించేలా యజమానులకు నోటీసులు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని.. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేయాలని ఆదేశించారు. ఈయన వెంట మున్సిపల్ డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలి


సంగపట్నంలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ బాలక్రిష్ణుడు

అవుకు: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలని డోన్ డీఎల్‌పీఓ బాలక్రిష్ణుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగపట్నం గ్రామాన్ని డోన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వరప్రసాద్‌తో కలిసి సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2018–2019లో ఆరుబయట మలవిసర్జన నిషేధించి ఇంటింటికీ మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. అవుకు మండలం సంగపట్నం గ్రామంలో 350 ఇళ్లకు మరుగుదొడ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామంలోని 120 ఇళ్లను సందర్శించి ఆరు బయట మలవిసర్జన చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. గ్రామంలో మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి ఆసక్తి చూపిన 25 మంది వివరాలు తీసుకుని ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15వేలు మంజూరు చేస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లనే వాడాలని సూచించారు. అవుకు, డోన్ ఎంపీడీఓలు మల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, ఈఓపీఆర్డీ రామ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

